క్లుప్తంగా

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం



నీలవేణి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

షాద్‌నగర్‌: ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని హెచ్‌ఎం జయమ్మ అన్నారు. మండల పరిధిలోని రాయికల్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్‌ అసిస్టెంట్‌, తెలుగు ఉపాధ్యాయురాలు నీలవేణి మంగళవారం స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో సన్మానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులతో నీలవేణి ఎంతో అనుబంధాన్ని ఏర్పరచుకున్నారన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. విద్యార్థులకు చక్కగా పాఠాలు బోధించి ఎంతో స్ఫూర్తిని నింపారని పేర్కొన్నారు. నీలవేణి శేష జీవితం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నీలవేణిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

నియామకం



యాదయ్యకు నియామకపత్రం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

మొయినాబాద్‌: బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా ముర్తూజగూడ గ్రామానికి చెందిన పాలమాకుల యాదయ్య యాదవ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. గ్రామాల్లో పార్టీని విస్తరించి వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్‌, బీజేపీ చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్‌ రాజమల్లేశ్‌, ప్రధాన కార్యదర్శి రాజుగౌడ్‌, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్‌, దర్శన్‌, విజయ్‌కుమార్‌, రవీందర్‌ ఉన్నారు.

ఆలయ భూముల వేలం రూ.7.75లక్షలు



వేలం పాటలో పాల్గొన్న కొందుర్గు గ్రామస్తులు

కొందుర్గు: కొందుర్గు శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించిన భూములను వేలం వేయగా రూ.7.75 లక్షలు వచ్చినట్లు ఈఓ శ్రీనివాస్‌ తెలిపారు. మంగళవారం ఆలయం 112 ఎకరాలను మూడేళ్లపాటు సాగు చేసుకోవడానికి వేలం వేయగా రూ.7.75 ఏడాది లెక్కన మూడేళ్లపాటు సాగు చేసుకొనేందుకు రైతులు వేలంలో పాట పాడారు. కార్యక్రమంలో అర్చకుడు రాజేశ్వరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూలే అంబేడ్కర్ జాతర కరపత్రం విడుదల



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్‌: పట్టణంలోని మండల పరిషత్‌ కార్యాలయ ఆవరణలో గల డాక్టర్‌ బీఆర్‌.అంబేడ్కర్‌ విగ్రహం వద్ద పూలే అంబేడ్కర్‌ జాతర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పూలే అంబేడ్కర్‌ 4వ జాతర కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా పూలే అంబేడ్కర్‌ జాతర ఉమ్మడి మహబూబ్‌నగర్‌ జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్‌ మాట్లాడుతూ.. దేశానికి పూలే, అంబేడ్కర్‌ చేసిన సేవలు మరువలేనివన్నారు. జాతర సందర్భంగా పూలే అంబేడ్కర్‌ చేసిన సేవలను, వారి జీవిత చరిత్రను ఆటాపాట, మాటలతో వివరిస్తామన్నారు. మే 27న అంబేడ్కర్‌ కళాభవన్‌లో నిర్వహించే పూలే అంబేడ్కర్‌ 4వ జాతరకు మేధావులు, కవులు, జానపద కళాకారులు, వివిధ సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. ఈ జాతరను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని దళిత, బహుజనులు, వివిధ సంఘాల నాయకులు, అంబేడ్కర్‌ వాదులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జంగయ్య, సూర్యనాయక్‌, కృష్ణయ్య, వెంకటయ్య, రాజునాయక్‌, శ్రీను, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉప పోరుకు సర్వం సిద్ధం

- రేపే ఎమ్మెల్సీ ఎన్నికలు
- చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- షాద్‌నగర్‌లో పోలింగ్‌ కేంద్రం ఏర్పాటు
- కేంద్రాన్ని పరిశీలించిన అధికారులు



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్‌: మహబూబ్‌నగర్‌ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపపోరుకు సమయం ఆసన్నమైంది. ఇందుకుగాను అధికారులు అన్ని ఏర్పాట్లు చురుగ్గా చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ నెల 28న నిర్వహించే ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించిన పోలింగ్‌ కేంద్రాన్ని షాద్‌నగర్‌లో ఏర్పాటు చేశారు.

చురుగ్గా ఏర్పాట్లు

పట్టణంలోని మండల పరిషత్‌ కార్యాలయం ఆవరణలోని సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించిన పోలింగ్‌ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో షాద్‌నగర్‌తో పాటు ఆమనగల్‌ పరిధిలోని మొత్తం మూడు మున్సిపాలిటీలు, పది మండలాలకు చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు మొత్తం 171 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 28న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్‌ జరగనుండగా, ఏప్రిల్‌ 2న కౌంటింగ్‌ నిర్వహిస్తారు. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీఓ వెంకట మాధవరావు ఆధ్వర్యంలో అధికారులు పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై చర్చించారు.

భారీగా సిబ్బంది

ఎన్నికల నిర్వహణకు 4 పోలింగ్‌ ఆఫీసర్లు, 13 మంది ఐడెంటిఫికేషన్‌ ఆఫీసర్లు, 4 సెక్టార్‌ ఆఫీసర్లను నియమించారు. అదేవిధంగా శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రంగస్వామి నేతృత్వంలో పోలీసులు పోలింగ్‌ కేంద్రం వద్ద గట్టి బందోబస్తు చర్యలు చేపట్టనున్నారు. పోలింగ్‌ కేంద్రం వద్ద ఏసీపీ, 7 మంది సీఐలు, 20 మంది ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, 63 మంది కానిస్టేబుళ్లతో పాటుగా సీఆర్‌పీఎఫ్‌ బలగాలను రంగంలోకి దింపనున్నారు.

భారీ బందోబస్తు



పోలింగ్‌ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. ప్రశాంత వాతావరణంలో పోలింగ్‌ నిర్వహించేందుకు అందరూ సహకరించాలి. ఎవరైనా అలజడులు సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు.

– రంగస్వామి, ఏసీపీ, షాద్‌నగర్‌

పకడ్బందీ ఏర్పాట్లు



ఎమ్మెల్సీ ఉపపోరుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాం. పోలింగ్‌ కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం.

– వెంకట మాధవరావు, ఆర్డీఓ, షాద్‌నగర్‌

చందనవెల్లి బాధితులకు న్యాయం చేయాలి

కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు స్వామి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్వామి

షాబాద్‌: చందనవెల్లి భూ బాధితులకు సమస్యపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకుడు చేవెళ్ల స్వామి పేర్కొన్నారు. మంగళవారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చందనవెల్లిలో సర్వే నెంబర్‌ 190లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి నష్టపోయిన రైతులను గుర్తించి వెంటనే నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, భూసేకరణ సమయంలో ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతీ ఇంటిలో ఒకరికి ఉద్యోగం, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పరిశ్రమల పేరుతో చందనవెల్లిలో సర్వే నెంబర్‌ 190లో 1200 వందల ఎకరాల భూమిని గతంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రైతుల నుంచి తీసుకుంది. అప్పట్లో ఎకరాకు రైతులకు రూ.9లక్షలు నష్టపరిహారం కొంతమంది రైతులకు మాత్రమే చెల్లించారు. మిగతా రైతులకు అందని నష్టపరిహారంపై జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి మాట్లాడుతూ.. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందే విధంగా తమవంతు కృషి చేస్తామన్నారు. రైతులకు న్యాయం చేస్తామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాలు, రైతులకు ఇళ్లస్థలాలు అందేవిధంగా చూస్తామని హామీనిచ్చారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన చేవెళ్ల నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీటీసీ రాములు తదితరులు

చేవెళ్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చేవెళ్ల ప్రాంతానికి చెందిన టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్‌, ఎంపీటీసీ రాములు, మాజీ సర్పంచ్‌ పామెన గోపాల్‌రెడ్డి, యువజన కాంగ్రెస్‌ నియోజకవర్గ సోషల్‌ మీడియా ఇన్‌చార్జి కె.మహేందర్‌గౌడ్‌లు కలిశారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో చేవెళ్ల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి వెళ్లినవారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీని గెలిపించుకుందామని ఆయన ఈ సందర్భంగా సూచించారు. పార్టీని గెలిపిస్తే మంచి భవిష్యత్‌ ఉంటుందని సీఎం చెప్పారన్నారు.

తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ రంగస్వామి

- రవాణాపై నిఘాను పటిష్టం చేయాలి
- శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి

షాద్‌నగర్‌రూరల్‌: ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున వాహనాల తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రాయికల్‌ టోల్‌ప్లాజా సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఏసీపీ రంగస్వామితో కలిసి డీసీపీ నారాయణరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీలను పరిశీలించారు. అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. చెక్‌పోస్టులవద్ద 24 గంటలు వాహనాల తనిఖీ కొనసాగుతుందన్నారు. అక్రమ రవాణాపై పోలీసులు నిఘాను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, బంగారం, వెండి, పేలుడు పదార్థాలు, మారణాయుధాలు వంటి వస్తువులను రవాణాచేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలలో పట్టుబడిన వాటికి సరైన ఆధారాలను చూపించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

మినీ స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన

కొందుర్గు: మండల కేంద్రంలో మినీ స్టేడియం ఏర్పాటు కోసం అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేశారు. మార్చి 14వ తేదీన స్టేడియం ఏర్పాటు కోసం అధికారులు ఉత్తర్వు లు జారీ చేశారు. ఈ మేరకు స్పోర్ట్స్‌ అథారిటీ ఓఎస్‌డీ రవీందర్‌రెడ్డి కొందుర్గు పడమర శివా రు సర్వే నెంబర్‌ 19లో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్లు తెలిసింది. ఈ స్టేడియం అవుట్‌డో ర్‌, ఇండోర్‌ క్రీడలకు అనుకూలంగా ఉండేలా నిర్మించనున్నట్లు అధికారులు వివరించారు.

టిఫిన్‌ సెంటర్‌ నిర్వాహకుడిపై దాడి

కేసు నమోదు

మొయినాబాద్‌: టిఫిన్‌ సెంటర్‌ నిర్వాహకుడిపై దాడిచేసి గాయపర్చిన వారిపై మొయినాబాద్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్‌నగర్‌ గ్రామానికి చెందిన దర్గ ప్రభాకర్‌ సర్వే నెంబర్‌ 177/39లో ఉన్న తన ప్లాట్‌లో టిఫిన్‌ సెంటర్‌ ఏర్పాటు చేశాడు. అయితే పక్క ప్లాటు వాళ్లు చింటు, సుధాకర్‌, సాయి, పీటర్‌ మంగళవారం ఉదయం 10:30 గంటల సమయంలో అక్కడికి వచ్చి ప్రభాకర్‌ టిఫిన్‌ సెంటర్‌ను ధ్వంసం చేశారు. ప్రభాకర్‌పై దాడిచేసి గాయపర్చారు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న జ్ఞాన మహా సభలు

నక్షత్ర ఆస్పత్రి, బ్రాహ్మణ పరిషత్‌ ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న నక్షత్ర ఆస్పత్రి వైద్యులు

బడంగ్‌పేట్‌: బాలాపూర్‌లోని ఎస్‌పీఆర్‌ గార్డెన్‌లో సనాతన వేదాంత జ్ఞాన మహా సభలు కొనసాగుతున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు, స్వామిజీలు, వేలాది మంది భక్తులు పాల్గొంటున్నారు. అందులో భాగంగానే ఎల్‌బీనగర్‌ నాగోల్‌లోని నక్షత్ర ఆస్పత్రి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సనాతన వేదాంత జ్ఞాన సభ వద్ద నిర్వహించారు. ఈ శిబిరంలో మూడు వందలకు పైగా భక్తులు పాల్గొని బీపీ, బీఎంఐ, ఈసీజీ, షుగర్‌, పరీక్షలు చేయించుకున్నారు. నక్షత్ర ఆస్పత్రి వైద్యులు జనరల్‌ మెడిసిన్‌, డయాబెటాలజిస్ట్‌, ఊపిరితిత్తులు, స్త్రీ సంబంధిత వ్యాధులు, ఎముకలు, కీళ్ల నిపుణులు, గుండె నిపుణులకు సంబంధించిన వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్త తీసుకోవాలన్నారు. అవసరం ఉన్న రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్‌ కృష్ణ తులసి, డాక్టర్‌ శిరీష, డాక్టర్‌ వంశీచంద్రరాజు, డాక్టర్‌ చంద్ర ప్రకాశ్‌, డాక్టర్‌ నమ్రత సంపత్‌, డాక్టర్‌ ఫాజియా, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్‌ అధ్యక్షుడు గంగు కృష్ణ చైతన్య, నక్షత్ర హాస్పిటల్‌ సీఈవో సోమ శేఖర్‌రెడ్డి, సీఎంవో బహబూబ్‌ బాషా, హర్ష, నవ్య, శిరీశ్‌, రాజేశ్వర్‌శర్మ, కొత్ర సతీష్‌కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

నవాబుపేట: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలని ఆ సంఘం చైర్మన్‌ పోలీస్‌ రాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం లావాదేవీలు, అప్పులు, రుణాలు, తదితర అంశాలపై సభలో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చాలా మంది రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో సంఘం దివాలా తీసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పంట రుణాలు, ఎల్‌టీ రుణాలు అడిగిన రైతులకు ఇవ్వడం జరుతుందన్నారు. బంగారంపై కూడా రుణాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సభ్యులు విఠల్‌రెడ్డి, మల్‌రెడ్డి, మాణయ్య, ప్రభు, సీఈఓ మోమన్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

శరీర దారుఢ్యానికి క్రీడలు దోహదం

జేబీఆర్‌ఈసీ కళాశాల ప్రిన్సిపాల్‌ డా.జి.వెంకటరమణారెడ్డి



క్రీడోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్‌ వెంకటరమణారెడ్డి తదితరులు

మొయినాబాద్‌రూరల్‌: క్రీడలు మానవుడి శరీర దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని జేబీఆర్‌ ఈసీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జేబీఆర్‌ఈసీ ఇంజినీరింగ్‌ కళాశాలలో డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ జె.గాయత్రీ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించే క్రీడోత్సవాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు ఆరోగ్యానికి ఎంతో మేలు అన్నారు. గెలుపు, ఓటములు సహజంగా తీసుకొని మూడురోజుల పాటు నిర్వహించే కబడ్డీ, క్రికెట్‌, వాలీబాల్‌, ఖోఖో, క్యారమ్స్‌, టెబుల్‌ టెన్నీస్‌, చెస్‌ క్రీడల్లో విద్యార్థులందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌ అరుణ్‌మూర్తి, జంగరాజు, ఎంఎల్‌ఎం ప్రసాద్‌, సివై రమేశ్‌, అబ్దుల్‌ రహమాన్‌, ఏఓ శ్రీనివాస్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూలీలకు సదుపాయాలు కరువు

కొందుర్గు: ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సదుపాయాలు కరువయ్యాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య విమర్శించారు. మంగళవారం ఆయన జిల్లేడ్‌ చౌదరిగుడ మండలం వనంపల్లిలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సర్కార్‌ నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. పథకానికి నిధుల కొరత విధించి పతకంలో పని చేస్తున్న ఫీల్డ్‌ అసిస్టెంట్‌లను తొలగించి ఉపాధి పనులను సక్రమంగా సాగకుండా చేసిందన్నారు. కూలీలు పని చేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కూలీలకు అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు కొలతలతో సంబంధం లేకుండా రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. లేనిచో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బుచ్చయ్య, యాదయ్య, రమేశ్‌ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జంగయ్య

రిసార్ట్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌ వినోద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మొయినాబాద్‌: ఎలాంటి అనుమతులు లేకుండా 111 జీవో పరిధిలో అక్రమంగా విల్లాల నిర్మాణం చేపడుతున్న డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్‌ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం చేవెళ్ల డివిజన్‌ కన్వీనర్‌ అల్లి దేవేందర్‌ డిమాండ్‌ చేశారు. అక్రమ నిర్మాణాలపై మంగళవారం డిప్యూటీ తహసీల్దార్‌ వినోద్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మొయినాబాద్‌ మండలంలోని బాకారం రెవెన్యూ సర్వే నెంబర్‌ 72లో డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్‌ యాజమాన్యం అక్రమంగా విల్లాలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. 111 జీవో అమలులో ఉన్న ఈ ప్రాంతంలో హెచ్‌ఎండీఏ అనుమతి లేకుండా విల్లాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అక్రమ నిర్మాణాలు చేపడుతూ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న యాజమాన్యంపై పంచాయతీ, రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే రెవెన్యూ, పంచాయతీరాజ్‌ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌, సురేందర్‌, శివ, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ధ్వంసం

మొయినాబాద్‌: గుర్తు తెలియని దుండగులు ఆలయ హుండీ ధ్వంసం చేసి డబ్బులు దొంగిలించారు. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నషాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నషాపూర్‌లో నూతనంగా నిర్మించిన భవానీమాత ఆలయాన్ని ఇటీవల ప్రారంభించారు. అయితే సోమవారం రాత్రి 7 గుడి తలుపులు మూశారు. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో గుడి దగ్గరకు వెళ్లి చూడగా హుండీ ధ్వంసం చేసి ఉంది. గుర్తుతెలియని దుండగులు హుండీ పగులగొట్టి అందులోని డబ్బులు దోచుకెళ్లి ఉంటారని గ్రామస్తులు భావించి మొయినాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎప్పుడొస్తారు..!



ఉదయం 11:30 గంటలకు తహసీల్దార్‌ కుర్చీ ఖాళీ



11:50 గంటలకు ఎంపీడీఓ సూపరింటెండెంట్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ కుర్చీ ఖాళీ

షాబాద్‌: సమయపాలన పాటించని అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అధికారులు సమయానికి విధులకు హాజరు కావడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. వారి ఇష్టానుసారంగా రావడం, పోవడం జరుగుతుందని ఆరోపణలు వినిపిస్తున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్‌, మండల పరిషత్‌ కార్యాలయాల్లో అధికారులు ఉదయం 11:30 వరకు కూడా విధులకు హాజరుకాలేదు. తహసీల్దార్‌ కార్యాలయం, మండల పరిషత్‌ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన పలు గ్రామాల ప్రజలు రైతులు చేసేదేమీ లేక బిక్కుబిక్కుమంటూ కూర్చున్నారు. కొందరైతే సారు ఇంకా రాలేదు కదా మళ్లీ వద్దాం పద అంటూ వెళ్లిపోయారు. రెండురోజులుగా సెలవుల తర్వాత కార్యాలయాలు ప్రారంభమైన మొదటిరోజు కూడా అధికారులు సమయానికి రాకుండా ఇష్టానుసారంగా హాజరుకాకపోవడం గమనార్హం. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో మండల అధికారులు ఇష్టానుసారంగా వస్తున్నారని ప్రజలు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్‌ ఏనాడు కూడా షాబాద్‌ మండలాన్ని సందర్శించిన పాపాన పోలేదని దీంతో అధికారులు ఆడిందే ఆట పాడింతే పాటగా మారింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు, స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.



ఉదయం 11:40 గంటలకు ఎంపీడీఓ కుర్చీ ఖాళీ